రేపు ప్రజావాణి రద్దు

కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగ సందర్భంగా ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించడంతో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

బీసీలకు వ్యతిరేకం కాదు

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రుతి



తాండూరు, జూలై19 (ఆంధ్రజ్యోతి): బీసీలకు బీజేపీ వ్యతిరేకం కాదని, మతపరమైన రిజర్వేషన్లు ఇస్తే వ్యతిరేకిస్తామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి వ్యాఖ్యానించారు. శనివారం తాండూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగిన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అబద్ధాలతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తే ఎస్సీ, ఎస్టీలకు ఎంత ఇస్తారని ప్రశ్నించారు. అనంతరం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ చేవెళ్ల పరిధిలో ఎంపీ నిధులు రూ.12 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్ బాలేశ్వర్ గుప్తా, నాయకులు శ్రీకాంత్, రమేష్, మాధవరెడ్డి, మనోహర్ రావు, పటేల్ విజయ్ కుమార్, బంటారం భద్రేశ్వర్, జుంటుపల్లి వెంకట్, సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు ఆహ్వానం

కొడంగల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. వాణిజ్య శాస్త్రం, తెలుగు, జంతు శాస్త్రం సబ్జెక్టుల్లో బోధించేందుకు 2 పోస్టులు, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్, ఎకనామిక్స్ ఇంగ్లిష్, హిందీ, పొలిటికల్ సైన్స్‌లో ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయని వివరించారు. పీజీలో ఓసీ, బీసీలు 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులతో ఉతీర్ణులైన వారు అర్హులు అని పేర్కొన్నారు. ఈ నెల 23 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని, వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వం ఇటీవల స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను ప్రకటించింది. జాతీయ, రాష్ట్రస్థాయిలో వెల్లడించిన ర్యాంకుల్లో ఉమ్మడి జిల్లాలోని నార్సింగి, పీర్జాదిగూడ, మణికొండ పురపాలికలు ఉత్తమ ర్యాంకులను సాధించాయి. మిగతా మున్సిపాలిటీలు అత్యుత్తమ ర్యాంకులను పొందడంలో వెనుకబడ్డాయి. పారిశుధ్య నిర్వహణలో చిత్తశుద్ధి కొరవడటంతో గతేడాది కంటే ఈ సారి వాటి ర్యాంకులు పడిపోయాయి. ముఖ్యంగా ఆదిభట్ల మున్సిపాలిటీ చెత్త రికార్డును సొంతం చేసుకుంది. గత ఏడాది 18వ స్థానంలో ఉన్న ఆదిభట్ల ఏకంగా 138వ ర్యాంకుకు పడిపోయింది.



స్వచ్ఛతలో.. వెనుకడుగు!

పడిపోయిన మున్సిపాలిటీల స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకు

- ఉమ్మడి జిల్లాలో నార్సింగి, పీర్జాదిగూడ, మణికొండ భేష్
- చెత్త రికార్డును సొంతం చేసుకున్న ఆదిభట్ల పురపాలిక
- గత ఏడాదితో పోలిస్తే మరింత దిగదుడుపు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): పురపాలికల్లో పారిశుధ్య నిర్వహణకు సంబంధించి కేంద్రం తాజాగా విడుదల చేసిన ర్యాంకుల్లో ఉమ్మడి జిల్లాలోని మూడు పురపాలికలు రాష్ట్రస్థాయిలో టాప్‌టెన్‌లో చోటు దక్కించుకున్నాయి. నార్సింగి పురపాలిక రాష్ట్రంలో మూడో స్థానం, పీర్జాదిగూడ 5వ స్థానం, మణికొండ ఏడో స్థానంలో నిలిచాయి. అయితే గత ఏడాది మంచి ర్యాంకులు సాధించిన పలు పురపాలికలు ఈ ఏడాది ర్యాంకింగ్‌లో బాగా వెనుకబడడం గమనార్హం. పారిశుధ్య

మిగతా 7వ పేజీలో..

ఉమ్మడి జిల్లాలో ఆయా పురపాలిక సంఘాల ర్యాంకులు

పురపాలికలు	మార్కులు	రాష్ట్ర	జాతీయ
నార్సింగి	9,884	3	25
పీర్జాదిగూడ	9,478	5	59
మణికొండ	9,180	7	167
బడంగ్‌పేట	8,582	12	151
తుర్కయాంజల్	8,478	15	214
దుండిగల్	8,470	16	216
బండ్లగూడ జాగీర్	8,414	19	232
షాద్‌నగర్	8,321	20	180



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్ , జూలై 19 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ ప్రతీక్ జైన్ హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో వసతి గృహాల తనిఖీలు, గురుకుల పాఠశాలల్లో సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, వన మహోత్సవం, నర్సరీల నిర్వహణ, సన్న బియ్యం పంపిణీ, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండల ప్రత్యేక అధికారులు వసతి గృహాలను సందర్శించి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. గురుకుల పాఠశాలల నిర్వహణ, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించేలా చొరవ చూపాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని, బిల్లులు లబ్ధిదారులకు త్వరగా అందేలా చూడాలని ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా శాఖలవారీగా లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద నుంచి రక్షించాలి



ఆందోళన చేస్తున్న వెంకటేశ్వర కాలనీవాసులు

కీసర రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కోతుల నుంచి రక్షించాలని తీర్చాలని కోరుతూ మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ 12వ వార్డు వెంకటేశ్వర కాలనీవాసులు శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో కోతుల బెడద రోజురోజుకు పెరిగిపోతుందని, దండుగా స్వైర విహారం చేస్తున్నాయని వాపోయారు. ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి కోతుల బెడద నుంచి తమను రక్షించాలని కోరారు. అనంతరం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు అక్కాల సురేష్, కాసపాక మహేష్, సురేష్, శ్రీకాంత్‌యాదవ్, యాదిరెడ్డి, నాగరాజు, సంపత్‌కుమార్, వినోద్‌కుమార్, రవికుమార్, సుదర్శన్, రాంరెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

భారీగా ఎస్ఐల స్థానచలనం

- 35 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- 15 మంది ప్రొబేషనరీ ఎస్ఐలకు పోస్టింగులు
- ముగ్గురు సీనియర్ ఎస్ఐలు వీఆర్‌కు..
- వీఆర్‌లో ఉన్న నలుగురికి పోస్టింగ్



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పోలీసు శాఖలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి భారీ సంఖ్యలో ఎస్ఐలకు స్థాన చలనం కల్పిస్తూ చార్మినార్ రేంజ్ డీఐజీ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వికారాబాద్ జిల్లా ఏర్పాటైన తర్వాత తొలిసారిగా 35 మంది ఎస్ఐలకు పోస్టింగులు ఇస్తూ ఉత్తర్వులు జారీ కావడం ఇదే తొలిసారి. 20 మంది ఎస్ఐలను బదిలీ చేయగా, వీరిలో వీఆర్‌లో ఉండి పోస్టింగుల కోసం ఎదురు చూస్తున్న నలుగురికి పోస్టింగులు కేటాయించారు. ఎస్‌హెచ్‌వోలుగా విధులు నిర్వహిస్తున్న ముగ్గురు సీనియర్ ఎస్ఐలను వీఆర్‌లో ఉంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. శిక్షణ పూర్తి చేసుకుని పోస్టింగుల కోసం ఎదురుచూస్తున్న 15 మంది ప్రొబేషనరీ ఎస్ఐలకు తొలిసారిగా వివిధ పోలీస్‌స్టేషన్లలో పోస్టింగులు ఇచ్చారు. ఎస్ఐల పోస్టింగుల్లో ప్రజా ప్రతినిధులు, అధికారుల సిఫారసులు బాగానే పనిచేశాయనే చర్చ పోలీసు శాఖలో కొనసాగుతోంది. ప్రస్తుతం పనిచేస్తున్న పోలీస్‌స్టేషన్లలో ఏడాది కూడా పూర్తి చేసుకోని పలువురు ఎస్ఐలను బదిలీ చేయడం కూడా చర్చనీయాంశంగా మారింది.

ఎవరెవరు బదిలీ అయ్యారంటే..

వికారాబాద్ ఎస్ఐ సత్యనారాయణ రాజును యాలాల్ ఎస్ఐ-2గా బదిలీ చేయగా, పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్

మిగతా 8వ పేజీలో...

మోస్తరు నుంచి భారీ వర్షం

ఉమ్మడి జిల్లాలో దంచికొట్టిన వాన • మేడ్చల్ జిల్లా మల్కారంలో 90.8 మిల్లీమీటర్లు నమోదు



మర్పల్లి: సిరిపురం వీరన్నవాగులో వరద ఉధృతి

వికారాబాద్/మేడ్చల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి రంగారెడ్డిజిల్లా వ్యాప్తంగా ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. శనివారం కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వాన కురిసింది. రోడ్లపైకి చేరిన వర్షం నీటితో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాప్రా మండలం ఈఎస్ఎస్ మల్కారంలో 90.8మి.మీ వర్షపాతం నమోదైంది. కాప్రాజీహెచ్ఎంసీ కార్యాలయ ప్రాంతంలో 77.8మి.మీ, ఇండస్ట్రియల్ ఏరియాలో 71.0మి.మీ, ఉప్పల్ రాజీవ్ నగర్ కమ్యూనిటీహాల్, ప్రశాంత్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద 68.5మి.మీ, మల్కాజిగిరి మండలం లాలాపేట్-మౌలాలి, శామీర్‌పేట మండలం దేవరయంజాల్ వద్ద 66.3మి.మీ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తాటివనంలో 74.0మి.మీ పసుమాముల వద్ద 60.0మి.మీ వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్, దోమ, పరిగి, బొంరాస్‌పేట్, బంట్వారం, యాలాల్, పూడూరు, కోట్‌పల్లి, వికారాబాద్, మర్పల్లి, నవాబ్‌పేట్ మండలాల్లో మోస్తరు వర్షం నుంచి భారీ వర్షం కురిసింది. మర్పల్లి మండలంలో కురిసిన వర్షానికి సిరిపురం వాగు ఉధృతంగా ప్రవహించింది. రాత్రి 8గంటల వరకు జిల్లాలో అత్యధికంగా మోమిన్‌పేట్‌లో 35.8మి.మీ వర్షపాతం నమోదైంది. దోమలో 28.3మి.మీ., పరిగిలో 18.5మి.మీ, రాపోల్‌లో 14.8మి.మీ, బొంరాస్‌పేట్‌లో 10.0మి.మీ, బంట్వారంలో9.5మి.మీ, తొరమామిడిలో 8.5మి.మీ, దావలాపూర్‌లో 8.3మి.మీ. వర్షం కురిసింది. కోట్‌పల్లిలో6.5మి.మీ, మద్గుల్ చిట్టంపల్లిలో 6.0మి.మీ., మన్నెగూడలో 5.8మి.మీ., మర్పల్లిలో 2.8మి.మీ, నవాబ్‌పేట్‌లో 2.0మి.మీ, వర్షం కురిసింది.

పెరిగిన సాధారణ వర్షపాతం...!

ఉమ్మడి జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో సాధారణ వర్షపాతం ఒక్కసారిగా పెరిగింది. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జూలై 16 వరకు భారీవర్షాలు లేకపోవడంతో సాధారణం కంటే 50-60 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. రెండు రోజుల్లో కురిసిన వర్షాలతో

మిగతా 7వ పేజీలో...

కూరగాయల తోటకు నష్టం

చేవెళ్ల/ కేశంపేట: చేవెళ్ల మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో మల్కాపూర్ గ్రామంలోని వరద నీరంతా రోడ్డు వెంబడి ఉన్న పొలాల్లోకి పారింది. నీటి ఉధృతికి రైతు మహేందర్‌గౌడ్ చెందిన ఆకుకూర పంట పూర్తిగా దెబ్బతిన్నది. అలాగే కేశంపేట మండల కేంద్రంలో గాలివానకు భోగ నీలమ్మ అనే మహిళా రైతుకు సంబంధించిన బీర, కాకర తోట పందిరి కూలింది. దీంతో తోట నేలవాలిపోయింది. రూ.2లక్షల వరకు నష్టం వచ్చినట్లు ఆమె తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వానకు చేవెళ్ల, కేశంపేట మండలాల్లోని పంటలకు జీవం వచ్చిందని రైతులు పేర్కొంటున్నారు.



తాండూరు తొలి డాక్టర్ పార్వతీదేవి

- ఉస్మానియా నుంచి ఎంబీబీఎస్
- 1965 నుంచి 1968 మధ్యలో స్థానికంగా వైద్య సేవలు
- రెండుసార్లు రాష్ట్రపతుల చేతులమీదుగా లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు
- కర్ణాటకలో మూడు అవార్డులు
- ప్రభుత్వ ఉన్నతాధికార హోదాలో విరమణ



రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పార్వతీదేవి (ఫైల్)

వైద్యరంగంలో ఎలాంటి వసతులు లేని సమయంలో తాండూరుకు తొలి మహిళా ప్రభుత్వ వైద్యురాలిగా వచ్చారు అదే పట్టణానికి చెందిన పార్వతమ్మ. 1965 నుంచి 1968 వరకు వైద్య సేవలు అందించి తర్వాత కుటుంబ కారణాలతో కర్ణాటకకు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అక్కడ అందించిన సేవలకు గాను స్వర్ణ కర్ణాటక, 2007లో మహిళా రత్న, 2013లో రాధకృష్ణ శిక్షణ రత్న అందుకున్నారు. 2014లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతులమీదుగా, అదే సంవత్సరం రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ చేతుల మీదుగా లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు.

Sunday Special

తాండూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉస్మానియా యూనివర్సిటీలో వైద్యురాలిగా పట్టా పొందిన డాక్టర్ పార్వతీదేవి 1965లో తాండూరు తొలి ప్రభుత్వ మహిళ వైద్యురాలిగా బాధ్యతలు చేపట్టారు. 1968 వరకు ఇక్కడే పనిచేసి గుల్బర్గ జిల్లా కమాల్‌పూర్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది శరత్ చంద్రపాటిల్‌ను పెళ్లి చేసుకున్నారు. తాండూరు కోర్వార్ కుటుంబానికి చెందిన పార్వతీదేవి పెళ్లి తర్వాత గుల్బర్గలో స్థిరపడ్డారు. పార్వతీదేవి, శరత్‌చంద్రపాటిల్ కుమారుడు లండన్ బరో ఆఫ్ లాంబెత్ మేయర్‌గా పని చేయడం విశేషం. కర్ణాటకలో వైద్య ఉన్నతాధికార హోదాలో పదవీ విరమణ పొందారు. వైద్యపరంగా కర్ణాటకలో గైనిక్‌పై మహిళల్లో విస్తృత అవగాహన కల్పించారు. భ్రూణ హత్యలు, బేటీ బచావో - బేటీ పడావోపై గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తూ గుర్తింపు పొందారు. 50 ఏళ్లుగా వైద్యపరంగా సామాజిక సేవలు

మిగతా 7వ పేజీలో..



దరఖాస్తులను పరిశీలిస్తున్న అధికారులు

దరఖాస్తుల పరిశీలన

వికారాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా, శిశు దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో దివ్యాంగులకు అందజేసే ఉపకరణాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ మేరకు 210 మంది దివ్యాంగులకు సంబంధించి ధ్రువపత్రలను జిల్లా కమటీ సభ్యులు పరిశీలించారు. అర్హత కలిగి, ఎంపికైన వారికి త్వరలోనే ఉపకరణాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, డీడబ్ల్యూవో కృష్ణవేణి, పాల్గొన్నారు.





పూజలో ఆలయ పురోహితులు, ధర్మకర్తలు

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



కొడంగల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): కొడంగల్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. రెండేళ్లకోసారి నిర్వహించే పవిత్రోత్సవాలను పురస్కరించుకొని అంకురార్పణ నిర్వహించారు. ఈ నెల 19 నుంచి ప్రారంభమయ్యే పవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయ మాడ వీధుల్లో భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్తలు మాట్లాడుతూ తిరుమల తిరుపతి తరహాలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

హైవే పనుల్లో వేగం పెంచాలి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 163 జాతీయ రహదారి పనుల్లో వేగం పెంచాలని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం సచివాలయంలో సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎస్ శ్రీనివాసరాజు, నేషనల్ హైవే ఉన్నతాధికారులు, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి పనుల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. హైవే విస్తరణ పనుల్లో జాప్యం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, యాదయ్య

పోలీసుల అదుపులో లారీ డ్రైవర్

ఆదిభట్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి లారీ డ్రైవర్ నిర్లక్ష్యంమే కారణమని తేలింది. ఓఆర్ఆర్‌పై వెళ్తున్న లారీ డ్రైవర్ నిబంధనలు పాటించకుండా తనకు కేటాయించిన లేన్‌లో వెళ్లకపోవడం, కారు 130స్పీడ్‌తో రావడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసు విచారణలో తేల్చారు. ఏసీపీ కేపీవీ రాజు, సీఐ రాఘవేందర్ రెడ్డిలు తెలిపిన వివరాల మేరకు.. ఘట్‌కేసర్ నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న లారీ ఔటర్‌పై కార్లు ప్రయాణించే సెకండ్ లేన్‌లో వెళ్లడంతోనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. అలాగే ఘట్‌కేసర్ నుంచి బెంగ్లూర్ వైపు వస్తున్న బలేనా కారు వెనక నుంచి 130వేగంతో వచ్చి ఎగ్జిట్ 12 సమీపంలోని వద్ద లారీని ఢీకొనగా ఐదుగురు మృతిచెందారన్నారు. ప్రమాదానికి కారణమైన లారీని ఆదిభట్ల పోలీసులు షాద్‌నగర్‌లో పట్టుకొని లారీని, డ్రైవర్‌ను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు. డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నాడు.

ఇందిరా మహిళా శక్తితో ఆర్థిక భరోసా


మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


బోనాలతో ఎదురేగి ఎమ్మెల్యే కసిరెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళా సంఘాల సభ్యులు

ఆమనగల్లు, జూలై19(ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థికభరోసా కలుగుతోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మహిళల ఆత్మ గౌరవం పెంపే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. ఆమనగల్లులోని లక్ష్మీ గార్డెన్‌లో శనివారం ఇందిరా మహిళాశక్తి సంబరాలు నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల ఎస్‌హెచ్‌జీల వేలాది మంది సభ్యులు హాజరయ్యారు. డీఆర్డీవో శ్రీలత అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఎమ్మెల్యే, అధికారులకు, నాయకులకు ఘనస్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలనతో సంబరాలను ప్రారంభించారు. నాలుగు మండలాల్లోని 2,378 సంఘాలకు రూ.2.30కోట్ల చెక్కులను డీఆర్డీవో మహిళా సంఘాల అధ్యక్షురాళ్లతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పం అన్నారు. మహిళల ఆశీర్వాదంతో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి కుటుంబాల అభివృద్ధి కోసం అహర్నిషలూ కృషి చేస్తోందన్నారు. సంఘాలకు వడ్డీలేని రుణాలు ఇస్తూ ఆర్థిక పురోగతికి ప్రభుత్వం బాటలు వేస్తోందని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 50శాతం పదవులను మహిళలకే కేటాయించనున్నందున జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, వార్డు మెం బర్లు, మున్సిపల్ కౌన్సిళ్ల పదవులు పొందేందుకు సన్నద్ధం కావాలని కసిరెడ్డి పిలుపునిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలను పట్టించుకోకుండా రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. కేసీఆర్ చేసిన అప్పుల కు ప్రతీనెల ప్రభుత్వం రూ.6,500 కోట్ల వడ్డీ కడుతూనే పథకాలు, అభివృద్ధిని నిరాఘాటంగా కొనసాగిస్తోందని తెలిపారు. అర్హులందరికీ ఇళ్లు, రేషన్ కార్డులిస్తామని చెప్పారు. డీఆర్డీవో శ్రీలత మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం ఆర్థికంగా వృద్ధి చెందాలని సూచించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ మాట్లాడుతూ.. ప్రభుత్వ చేయూతతో మహిళల్లో ఆత్మగౌరవం పెరిగిందన్నారు. ప్యాక్స్ చైర్మన్ వెంకటేశ్ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చినహామీ మేరకు విద్యార్థినులకు స్కూటీలు, పేద మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఏపీఎంలు సబితాదేవి, రాజేశ్వరి, శ్రీదేవి, సుదర్శన్‌రెడ్డి, మండల మహిళా సమా ఖ్య అధ్యక్షురాళ్లు శోభారాణి, స్వప్న, శైలజ, కవిత, జిల్లా నాయకురాలు నిర్మల, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, నాయకులు శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, వై.నర్సింహ, కిషన్‌రెడ్డి, జగన్, డి.ప్రభాకర్‌రెడ్డి, బిచ్యానాయక్, మానయ్య, కె.శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణనాయక్, రమణారెడ్డి, నారాయణ, దశరథం, విజయ్‌నాయక్, టి.రవీందర్, శ్రీకాంత్,శ్రీశైలం, బాబ, విజయ్‌రాథోడ్, శేఖర్‌గౌడ్, లక్ష్మి, చందోజీ, శ్రీశైలం, వెంకటేశ్, అంజన్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు పెద్ద పీట

రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వాస్పత్రులను తీర్చిదిద్ది రోగులకు మెరుగైన సేవల అందిస్తున్నట్లు చెప్పారు. బండోనిపల్లికి చెందిన రాజుకు రూ.3.5లక్షల ఎల్‌వోసీ, ఆమనగల్లుకు చెందిన దేశ్యకు రూ.34వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే అందజేశారు.

రైల్వే స్టేషన్‌లో పనిచేయని లిఫ్టులు

● మెట్లు ఎక్కలేక ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

తాండూరు,జూలై19(ఆంధ్రజ్యోతి): తాండూరు రైల్వే స్టేషన్‌లోని లిఫ్ట్ రిపేరుకు వచ్చింది. రెండు రోజులుగా రెండో ప్లాట్ ఫారమ్‌లోని లిఫ్ట్ పని చేయక తాండూరు రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణం సాగించే ప్రయాణికులు, చిన్నారులు, వృద్ధులు, ఆస్పత్రులకు వెళ్లే రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే ప్లాట్ 1, 2లలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాకపోకలకు ఇబ్బందులుండగా లిఫ్ట్ మరమ్మతులకు గురికావడంతో రైల్వే ప్రయాణికులు మరింత అసౌకర్యానికి గురవుతున్నారు. ఒకటో ప్లాట్ ఫామ్‌లోని లిఫ్ట్ రిపేరుకు వచ్చి రెండు నెలలు అవుతున్నా మరమ్మత్తులు చేయించలేదనిప్రయాణికులు వాపోయారు. గురువారం హుబ్లీ, రాయలసీమ, చిత్తాపూర్ రైళ్లలో తాండూరు స్టేషన్‌లో దిగిన ప్రయాణికులు లిఫ్ట్ పనిచేయక మెట్లబాట పట్టారు. ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి లిఫ్టల పనులను త్వరగా పూర్తిచేయించేలా చూడాలని కోరుతున్నారు.

మహిళాభ్యున్నతికి ప్రభుత్వం కృషి


మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషిచేస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని పెద్దషాపూర్ ఎస్‌వీ రెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు పథకాలను అమలుచేస్తున్నారని తెలిపారు. అనంతరం 983మహిళా సంఘాలకుమంజూరైన రూ.90.9లక్షల చెక్కును అందజేశారు.కార్యక్రమంలో ఎంపీడీవో మున్నీ, మాజీ జెడ్పీటీసీ తన్వీరాజు,కాంగ్రెస్ నాయకులు చంద్రారెడ్డి, మహేందర్, కోటేశ్వర్‌గౌడ్, ప్యాక్స్‌చైర్మన్ శ్రవణ్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్, దినకర్, రవి, సురేశ్, ఆనంద్, ఇంద్రారెడ్డి, కృష్ణ, నర్సింహ రమేశ్, ప్రభాకర్, మనోజ్, జగన్‌గౌడ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు


లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

దుద్యాల/బొంరాస్‌పేట్, జూలై 19(ఆంధ్రజ్యోతి):అర్హులైన వారందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. శనివారం దుద్యాలలో స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు రేషన్‌కార్డుల ప్రొసీడింగ్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. దుద్యాల మండలంలో వెయ్యి నూతన రేషన్ కార్డులు, పాత కార్డుల్లో కొత్తగా 452మంది పేర్లు చేర్పించామని తహసీల్దార్ కిషన్‌నాయక్ తెలిపారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన 19మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, డీటీ వీరేశ్‌బాబు, నాయకులు రవినాయక్, సత్యనారాయణ, మొగులయ్య, ఖాజా, శ్రీశైలంగౌడ్, ఖలీల్ పాషా పాల్గొన్నారు. అలాగే బొంరాస్‌పేట్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి రేషన్ కార్డుల ప్రొసీడింగ్‌లను రాజేశ్‌రెడ్డి అందజేశారు. మండలంలో కొత్తగా 1,014 రేషన్ కార్డులు మంజూరైనట్లు తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. పేదల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, ప్యాక్స్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ నాయకులు నర్సిములుగౌడ్, వెంకట్రాములుగౌడ్, అంజిల్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలి


ఉపాధ్యాయ సంఘ సభ్యత్వాన్ని అందజేస్తున్న వెంకటప్ప

షాద్‌నగర్ రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న పే రివిజన్ కమిషన్‌ను వెంటనే అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధన కార్యదర్శి వెంకటప్ప డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మార్సీలో శనివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 2023 జూలై 1 నుంచి అమలుకావాల్సిన పీఆర్సీని రెండేళ్లు దాటినా అమలుచేయకపోవడం సరికాదన్నారు. ఇది ఉద్యోగుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా డీఏ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలను దృష్టిలో పెట్టుకుని ఆరు నెలలకో డీఏ ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 19నెలలు గడుస్తున్నా హామీ అమలు చేయడం లేదని విచారం వ్యక్తంచేశారు. టీచర్లకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని అన్నారు. దుర్మార్గ పీఎఫ్ఆర్‌డీఏ చట్టాన్ని, సీపీఎస్‌లను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలుచేయాలని అన్నారు. కేజీబీవీల సమ్మెకాలం జీతాలను విడుదల చుయాలని తెలిపారు. గురుకులాల సమయాన్ని ఉదయం 9నుంచి సాయంత్రం 4.30వరకు మార్చాలని కోరారు. అనంతరం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. సమావేశంలో యూటీఎఫ్ నాయకులు వెంకటయ్య, నర్సింలుగౌడ్, చంద్రశేఖర్, సత్యం, లక్ష్మీదేవమ్మ, కృష్ణయ్య, రంగరాజ్ కుమార్, బాలయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.



ఇబ్రహీంపట్నం బస్టాండ్‌ను పరిశీలిస్తున్న డీసీపీ సునీతారెడ్డి

మహిళల భద్రతకు మరింత నిఘా

ఇబ్రహీంపట్నం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో మహిళలు, విద్యార్థినుల భద్రతకు మహిళా సిబ్బందితో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటామని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. శనివారం ఆమె బస్టాండ్‌ను సందర్శించి మహిళలు, విద్యార్థినులతో మాట్లాడారు. ఆకతాయిలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే తమ స్బిబందికి సమాచారమివ్వాలన్నారు. బస్టాండ్‌లో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. 24గంటలు నిఘా పెంచుతామన్నారు. ఉదయం, సాయంత్రం రద్దీ సమయాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బస్టాండ్ ఆవరణలోకి బయటి వాహనాలు రాకుండా చూడాలని ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. ఆమె వెంట అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ కేపీవీ రాజు ఉన్నారు.

లంచం డిమాండ్ చేస్తే ఫోన్ చేయండి

● విద్యుత్ శాఖ కార్యాలయంలో ఫోన్ నంబర్లతో స్టిక్కర్లు



ఆఫీసులో అతికించిన స్టిక్కర్లు



తాండూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): లంచం ఇస్తేనే పని అవుతుందన్న అపవాదును తొలగించుకునేందుకు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎవరైనా లంచం అడిగితే ఫోన్ చేయాలని కార్యాలయాల వద్ద స్టిక్కర్‌లను ఏర్పాటు చేశారు. అవినితి ఆరోపణలు ఎదుర్కుంటున్న విద్యుత్ శాఖ దిద్దుబాటు చర్యలకు ఉప్రకమించింది. ఈ మేరకు తాండూరు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు టీజీఎస్‌పీడీసీఎల్ పేరిట ట్రాన్స్‌కో ఏడీఈ, ఏఈ కార్యాలయం వద్ద స్టిక్కర్లు అంటించారు. ఎవరైనా డబ్బు డిమాండ్ చేస్తే సెల్ నం. 7680901912 లేదా 04023454884లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఇలాంటి పద్ధతినే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, ముఖ్యంగా రెవెన్యూ, మున్సిపాలిటీ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నాయీ బ్రాహ్మణుల సేవలు బంద్

వికారాబాద్, జూలై 19(ఆంధ్రజ్యోతి):హై కోర్టు తీర్పును గౌరవించినా, తమ వృత్తికి అన్యాయం, అపహాస్యాన్ని నిరసిస్తూ జిల్లాలో నెల రోజుల పాటు సంప్రదాయ సేవలన్నీ నిలిపేస్తున్నట్లు నాయీ బ్రాహ్మణ జేఏసీ ప్రకటించింది. శనివారం వికారాబాద్‌లో సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. క్షవరం, పురుడు, పుట్టెంటుకలు, మైలపోలు తీయడం, సన్నాయి వాయించడం వంటి సంప్రదాయ పనులను శనివారం నంచే నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వారంరోజుల్లో జిల్లా స్థాయి లోకుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, న్యాయ వ్యవస్థ స్పందించి న్యాయం చేయకుంటే ఇతర జిల్లాల్లోనూ ఇదే నిరసన చేపడుతామని తెలిపారు. కల్యాణ కట్టల్లోని ఉద్యోగుల డిమాండ్లపై వారంలోగా స్పందించకుంటే తల నీలాల పనులను కూడా నిలిపేస్తామని స్పష్టం చేశారు. ఏ పని ఎవరైనా చేస్కోవచ్చంటే తమ పనులనుకూడా ఇతర మతస్తులతో చేయించాలని, తమపై ఒత్తిడి తేవద్దని జేఏసీ స్పష్టం చేసింది.


నిరసన తెలుపుతున్న నాయీ బ్రాహ్మణ జేఏసీ నాయకులు

ఆరోగ్యం విషయంలో
ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలి



ఫుడ్ ఫెస్టివల్, ప్రొడక్ట్ మేళాను తిలకిస్తున్న కమిషనర్ సత్యనారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం విషయంలో ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మెప్మా అధికారి వెంకటేశ్వర్లు, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం, ప్రొడక్ట్ మేళా ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు, మెప్మా ఆర్పీలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఆరోగ్యం విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపో అనారోగ్యం బారినపడి వైద్య చికిత్సలకు డబ్బులు ఖర్చుచేస్తున్నారని అన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు. మద్యం, సిగరెట్‌లకు దూరంగా ఉండాలని, పోషకాహారం తీసుకుంటే రోగాలు రావన్నారు. పారిశుధ్య కార్మికులు మాస్కులు, చేతులకు గ్లౌజులు తప్పక ధరించాలన్నారు. కార్యక్రమంలో వంద రోజుల ప్రణాళిక ప్రత్యేకాధికారి శ్రీనివాస్, సాయిక్రిష్ణారెడ్డి, ప్రణవ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనురాగ్ వర్సిటీలో స్నాతకోత్సవం



సీతారాంకు జ్ఞాపికను అందజేస్తున్న యూనివర్సిటీ సీఈవో నీలిమ

ఘట్‌కేసర్ రూరల్, జూలై19(ఆంధ్రజ్యోతి): దేశానికి ఆలోచనాపరులే కాదు సైన్స్, టెక్నాలజీ, మానవత్వంలో మనల్ని ముందుకు తీసుకెళ్లగల వ్యక్తులు అవసరమని ఏఐసీటీఈ(అల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) చైర్మన్ టీజీ సీతారాం తెలిపారు. మేడ్చల్ జిల్లా, పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం జరిగిన రెండో స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదివే విద్యపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. ఆలోచనాపరులే కాదు సైన్స్ అండ్ టెక్నాలజీ, మానవత్వంలోనూ ముందుకు తీసుకెళ్లగలిగే వ్యక్తులు ఈ దేశానికి అవసరమని అన్నారు. ప్రపంచం భారత్‌ను ఆవిష్కరణల కేంద్రంగా చూస్తోందన్నారు. విద్యార్థులు ఉద్యోగాల కోసమే కాకుండా భవిష్యత్తు సృష్టికర్తలు కావాలని ఆకాంక్షించారు. ఉత్తమ విద్యార్థులను ఆయన సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. స్నాతకోత్సవంలో 2,260 మంది విద్యార్థులకు పట్టా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ చాన్స్‌లర్ యూబీ దేశాయ్, వైస్ చాన్స్‌లర్ మంత్రి అర్చన, సీఈవో సూర్యదేవర నీలిమ, హెచ్‌వోడీలు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

విధులకు ఉపాధ్యాయుల ఆలస్యం

- స్కూలు బయట ఆడుకున్న విద్యార్థులు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం
- ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారంటున్న గ్రామస్తులు



గుంతబాస్పల్లిలో ఉపాధ్యాయురాలు రాక ఆడుకుంటున్న విద్యార్థులు

తాండూరు రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు సమయానికి రావాల్సిన ఉపాధ్యాయులు రాక విద్యార్థులు ఆరుబయటే ఆడుకున్నారు. పిల్లలు ఆడుకుంటుండం చూసిన తల్లిదండ్రులు ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంతబాస్పల్లి పాఠశాలలో 1 నుంచి ఐదో తరగతి వరకు ఉన్నాయి. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా, 24మంది విద్యార్థులు ఉన్నారు. శనివారం ఉదయం పాఠశాల సమయానికి ఇద్దరు ఉపాధ్యాయులూ హాజరు కాలేదు. దీంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆడుతూ సమయాన్ని గడిపారు. గ్రామస్తులు మాత్రం ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. మండలంలో పాఠశాలలను పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా స్కూళ్లకు వస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఉపాధ్యాయులు పాఠశాలల సమయానికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విధులకు ఆలస్యంగా హాజరవుతున్న ఉపాధ్యాయులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

42 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్ట్, పరారీలో ఇద్దరు

మూడుచింతలపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి సంగారెడ్డికి రవాణా చేస్తున్న 42కిలోల ఎండు గంజాయిని మేడ్చల్ ఎస్‌వోటీ, శామీర్‌పేట్ పోలీసులు సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నారు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఓఆర్ఆర్ రోటరి-2 వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన అంతర్రాష్ట్ర ముఠా బిలాలె ప్రవీణ్(31), అవినాష్(22), సతీష్(32) హైదరాబాద్‌కు తరచూ వచ్చి గంజాయి అమ్ముకొని వెళ్లేవారు. ఈ క్రమంలో ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా పోడియాకు చెందిన జిత్తు అలియాస్ హ్యాపీ నుంచి 42కిలోల గంజాయిని సేకరించారు. సంగారెడ్డి జిల్లా నాగిల్‌గిద్ద మండలం మావినెల్లికి చెందిన రాథోడ్ హీరాలాల్‌కు విక్రయించాలని లారీలో బయలుదేరారు. ఎండు గంజాయిని రవాణా చేస్తున్నారనే సమాచారంతో మేడ్చల్ ఎస్‌వోటీ, శామీర్‌పేట్ పోలీసులు శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వద్ద గస్తీ నిర్వహించారు. నిందితులు లారీ దిగి రాథోడ్ కోసం వేచి చూస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి 42కిలోల గంజాయి 3సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే అవినాష్‌పై మంగళ్‌హాట్‌లో మూడు కేసులు, సతీష్‌పై కుల్సుంపురలో రెండు కేసులున్నట్లు పోలీసులు తెలిపారు. ఒడిశాకు చెందిన గంజాయి విక్రయదారుడు జిత్తు, సంగారెడ్డికి చెందిన కొనుగోలుదారుడు రాథోడ్ పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, మేడ్చల్ ఎస్‌వోటీ డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ విశ్వప్రసాద్, పేట్‌బషీరాబాద్ ఏసీపీ బాలగంగిరెడ్డి, సీఐ శ్రీనాథ్, ఎస్‌వోటీ సీఐ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఎస్సైలు దశరథ్ పాల్గొన్నారు.



గంజాయి నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఉపాధి వేతలు

- సకాలంలో వేతనాలందక ఇక్కట్లు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కొడంగల్ రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సిబ్బందికి 3నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు పనులు చేయిస్తూ విధులు నిర్వర్తిస్తున్నా వేతనాలు మాత్రం సకాలంలో ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు పరిశీలిస్తూ కూలీలకు సౌకర్యాలందించేందుకు పనిచేస్తుంటారు. కూలీలకు కూలి వచ్చేలా ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ఏపీఎంలు ఇలా వివిధ హోదాల సిబ్బంది పనిచేస్తారు. తమకు ఏప్రిల్, మే, జూన్ నెలల వేతనాలు ఇంకా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఏపీవో, ఈసీ ఒక్కొక్కరు, ముగ్గురు టీఏలు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, 15మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. గ్రామాల్లో రోజూ పనులు చేయిస్తున్న తమపై ప్రభుత్వం చిన్నచూపుచూస్తోందని వాపోతున్నారు. వేతనాలందక ఇబ్బంది పడుతున్నామంటున్నారు. అప్పులు చేసి పిల్లల ఫీజులు కట్టామని, అధికారులు వేతనాలను విడుదల చేయాలని కోరుతున్నారు. అలాగే 16 నెలల ఆఫీస్ మెయింటెనెన్స్ నిధులు సైతం రావడం లేదని సిబ్బంది చెబుతున్నారు.

ఎంపీ ఈటలను కలిసిన ట్రెటా నాయకులు



ఆమనగల్లు, జూలై 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం (ట్రెటా) నాయకులు శనివారం ఎంపీ ఈటల రాజేందర్‌ను నగరంలో మర్యాద పూర్వకంగా కలిసి పూలమాలలు, శాలువాలతో ఎంపీని సన్మానించారు. ఆర్థిక బిల్లు-2025 వల్ల పెన్షనర్లకు కలిగే నష్టాన్ని వివరించినట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లిక్కి అనురుద్రారెడ్డి పేర్కొన్నారు. పెన్షనర్ల సమస్యలను రాజేందర్‌కు వివరించగా పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారని తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో సంఘం నాయకులు వినోద్ కుమార్, శ్రీనివాస్, నర్సింహ, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రహరీలకు
నోచని పాఠశాలలు

- ఇబ్బందుల్లో విద్యార్థులు, సిబ్బంది



ప్రహరీ లేని అప్పాయిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల

కొడంగల్ రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, నాణ్యమైన విద్య అందించాలని ఓ వైపు బడిబాట కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వం పాఠశాలల్లో వసతుల కల్పనపై దృష్టి సారించడం లేదు. కొడంగల్ మున్సిపాలిటీ, రూరల్ మండలంలో 7 ఉన్నత పాఠశాలలు, 10 ప్రాథమికోన్నత, 37 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో అప్పాయిపల్లి, ఉడిమేశ్వరం, హస్నాబాద్, గుండ్లకుంట, హుసేన్‌పూర్, ప్యాలమద్ది, సంగాయిపల్లి, లక్ష్మీపల్లి, అన్నారం, నాగారం, పాటిమీదిపల్లి, పలుగురాళ్ల తండా, మైసమ్మ తండా, రావులపల్లి, బోయపల్లితండా, భవనమ్మ తండా, భీమ్లీతండా పాఠశాలలకు ప్రహరీ గోడల్లేవు. దీంతో పాఠశాలల ఆవరణలోకి పశువులు, పందులు, పాములు, విషకీటకాలు వస్తున్నాయని ఆయా గ్రామాల వాసులు అంటున్నారు. కొన్ని పాఠశాలలు ఊరికి దూరంగా ఉన్నాయి. వాటికీ ప్రహరీల్లేక కొందరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కొన్ని పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. కొన్ని స్కూళ్లకే పూర్తిస్థాయి కాంపౌండ్ వాళ్లు ఉన్నారు. ప్రహరీ లేక విద్యార్థుల దృష్టి సైతం చదువు నుంచి బయటకు మళ్లుతోంది. కుక్కలు, పందుల సంచారంతో పిల్లలు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. బడులకు రక్షణగా ప్రహరీలు నిర్మించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఊరికి దూరంగా, ప్రహరీ లేని ప్యాలమద్ది పాఠశాల



కాంపౌండ్ లేని సంగాయిపల్లి ప్రాథమిక పాఠశాల

స్వచ్ఛతలో వెనుకడుగు!

(ఐదో పేజీ తరువాయి)

నిర్వహణలో వెనుకబడిన చెత్త పురపాలికల్లో ఆదిభట్ల కూడా ఉంది. నగర శివార్లలోని పలు పురపాలికల్లో స్వచ్ఛత అంతంత మాత్రంగానే ఉందని తేలింది. ఈ సారి కేంద్రం స్వచ్ఛ సర్వేక్షణ ర్యాంకులను జాతీయ, రాష్ట్రస్థాయి స్థాయిలో మాత్రమే ప్రకటించింది. గత కొంతకాలంగా ఉన్న జోనల్ ర్యాంకులను రద్దు చేసింది. భవిష్యత్తులో పురపాలికలకు ఈ ర్యాంకుల ఆధారంగా నిధులు విడుదల చేయనున్నారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులను పరిశీలిస్తే నార్సింగి, పీర్జాదిగూడ, మణికొండ ముందు వరుసలో ఉన్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ కింద వివిధ అంశాలను పరిగణలోకి తీసుకుని ర్యాంకులను ప్రకటించారు. ఇంటింటి చెత్తసేకరణ, పబ్లిక్ టాయిలెట్ల శుభ్రత, డంపింగ్ యార్డులకు చెత్తతరలింపు, వ్యర్థాలను వేరుచేసి పునర్వినియోగ ప్రక్రియ చేపట్టడం, వ్యాపార కేంద్రాల వద్ద పారిశుధ్య నిర్వహణ తదితర అంశాల ఆధారంగా మార్కులు కేటాయించారు. మొత్తం 12,500



మార్కుల ఆధారంగా ర్యాంకులు ప్రకటించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 12,500 మార్కులకు ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా నార్సింగి పురపాలికకు 9,884 మార్కులొచ్చాయి. ఉమ్మడి జిల్లాలో ఇంటింటి చెత్త సేకరణ నామమాత్రంగానే కొనసాగుతోంది. నార్సింగ్‌లో మాత్రం 100శాతం చెత్త సేకరిస్తున్నారు. అలాగే నివాస ప్రాంతాలు, వ్యాపార కేంద్రాలు, నీటి వనరులు ఉన్నచోట 100శాతం పారిశుధ్య నిర్వహణ చేస్తున్నారు. ఇక్కడ 59శాతం వ్యర్థాలను వేరు చేస్తున్నారు. పబ్లిక్ టాయిలెట్ల శుభ్రత 25శాతం మాత్రమే చేపడుతున్నారు. మణికొండలో నివాస ప్రాంతాలు, వ్యాపార కేంద్రాలు, నీటి వనరులు ఉన్నచోట 100 శాతం పారిశుధ్య నిర్వహణ చేస్తున్నారు. అలాగే పబ్లిక్ టాయిలెట్ల శుభ్రత 100 శాతం నిర్వహిస్తున్నారు. అయితే ఇంటింటి చెత్త సేకరణ 59శాతం, వ్యర్థాలను 19శాతం వేరు చేస్తున్నారు.

గత ఏడాది కంటే వెనుకబాటు

ఉమ్మడి జిల్లాలో పలు పురపాలికల్లో పారిశుధ్య కార్యక్రమాలు పడకేశాయి. గత ఏడాది కంటే ఇక్కడ పారిశుధ్య నిర్వహణ దిగజారింది. గత ఏడాది రాష్ట్రంలో నాలుగో స్థానంలో ఉన్న బండ్లగూడ జాగీర్ ఈ ఏడాది 19వ స్థానానికి పడిపోయింది. గతేడాది 7వ స్థానంలో ఉన్న మేడ్చల్ ఈ ఏడాది 37వ స్థానంలో నిలిచింది. గతంలో 15వ స్థానంలో ఉన్న ఇబ్రహీంపట్నంకు 23వ స్థానం దక్కింది. 16వ స్థానంలో ఉన్న ఘట్‌కేసర్ 30వ స్థానం, 17వ స్థానంలో ఉన్న శంషాబాద్ 76వ స్థానంలో ఉన్నాయి. గత ఏడాది 18వ స్థానంలో ఉన్న ఆదిభట్ల ఏకంగా 138వ ర్యాంకుకు పడిపోయింది. పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్న ఈ మున్సిపాలిటీ 4,200 మార్కులతో అట్టడుగున ఉంది. జాతీయ స్థాయిలో 5-3లక్షల జనాభా ఉన్న పురపాలికల కేటగిరీలో బడంగ్‌పేట 151ర్యాంకు, షాద్‌నగర్ 180వ ర్యాంకు, వికారాబాద్ 192వ ర్యాంకు, జల్‌పల్లి 231వ, మీర్‌పేట 265వ ర్యాంకుల్లో నిలిచాయి.

మెనూ ప్రకారం
మధ్యాహ్న భోజనం అందించాలి



కొత్త వంట సామగ్రిని ఉపయోగించాలని సూచిస్తున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

కొడంగల్ రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్నభోజనం అందించాలని సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. శనివారం పర్సాపూర్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ సభ్యులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరంగా భోజనాన్ని అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. వంట గదిని పరిశీలించగా ప్రభుత్వం భోజన ఏజెన్సీలకు అందించిన స్టీల్ పాత్రల్లో కాకుండా పాత అల్యూమినియం పాత్రల్లోనే వండడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కొత్త వంట సామగ్రిని ఉపయోగించాలన్నారు. సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రియదర్శిని, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్థానిక ఎన్నికలకు
సమాయత్తం కావాలి



చల్లా వంశీచంద్‌రెడ్డిని సన్మానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, యాట గీతనర్సింహ

ఆమనగల్లు, జూలై 19(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి పిలుపునిచ్చారు. విపక్షాల విష ప్రచారాలు, కుట్ర రాజకీయాలను తిప్పి కొట్టి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను గడప గడపకూ చేరవేయాలని సూచించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ ఏఐసీసీ ఇన్‌చార్జిగా నియమితులైన వంశీచంద్‌రెడ్డిని శనివారం పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీతనర్సింహ, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు. వెల్దండం మండలం అప్పారెడ్డిపల్లిలో వంశీని కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు ఉంటుంద ని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించి గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను కాలరాస్తోందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందన్నారు.

తాండూరు తొలి డాక్టర్ పార్వతీదేవి

(ఐదో పేజీ తరువాయి)

అందించారు. హైదరాబాద్, కర్ణాటక ఎడ్యుకేషనల్ సొసైటీలో గవర్నింగ్ కౌన్సిల్ ప్రొఫెసర్‌గా, వివిధ రాష్ట్రాల్లో వైద్య ఎగ్జామినర్‌గా పనిచేశారు. కర్ణాటక మహాదేవప్ప మెడికల్ కళాశాలలో హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్(గైనిక్)గా ఉద్యోగ విరమణ పొందారు. 2011లో తన కుమారుడు లండన్ మేయర్ నీరజ్ పాటిల్‌తో కలిసి తాండూరులో పలువురి చేత సన్మానం పొందారు. గుల్బర్గ బసవేశ్వర ఆస్పత్రి డైరెక్టర్‌గా కూడా పని చేశారు. ప్రస్తుతం పదవీ విరమణ పొంది పుట్టినిల్లు తాండూరులో కొన్ని రోజులు, మెట్టినిల్లు కర్ణాటకలో కొన్ని రోజులు గడుపుతోంది.

నాలుగో తరగతి వరకు తాండూరులోనే..

తాండూరుకు చెందిన ప్రముఖ వ్యాపారి కోర్వార్ సిద్రామప్ప-గంగమ్మ దంపతులకు 1940లో పార్వతీదేవి జన్మించారు. తాండూరు మిషన్ స్కూల్‌లో నాలుగో తరగతి వరకు చదివారు. ఇక్కడ హైస్కూల్ లేని కారణంగా కర్ణాటక రాష్ట్రం బీదర్‌లో తండ్రి సిద్రామప్ప పెట్రోల్ బంక్ వ్యాపారం నిర్వహిస్తున్నందున అక్కడికి వెళ్లి హైస్కూల్, ఇంటర్మీడియట్ పూర్తిచేశారు. తర్వాత ఉస్మానియా యూనివర్సిటీలో సీటు సాధించి ఎంబీబీఎస్ పూర్తిచేశారు. తాండూరులో తొలి వైద్యురాలిగా వచ్చి 1968 వరకు విధులు నిర్వర్తించి పెళ్లి తర్వాత కర్ణాటక వెళ్లారు. తన తండ్రి ప్రోత్సాహంతోనే వైద్యురాలినయ్యానని, గాడ్ గిఫ్ట్ వల్లే తన కుమారుడు లండన్ మేయర్ అయ్యాడని గర్వంగా చెబుతారు పార్వతీదేవి. తాను వైద్యురాలిగా తాండూరులో సేవలందించినప్పుడు సరైన వైద్య సదుపాయాలు ఉండేవి కావని, సిజేరియన్ కేసుంటే హైదరాబాద్‌కు రిఫర్ చేసే వాళ్లమని చెప్పారు. తాను కర్ణాటకకు వెళ్లిన తర్వాతే తాండూరుకు ఎక్స్‌రే వచ్చిందని, ప్రస్తుతం టెక్నాలజీతో పాటు వైద్యం ఖరీదు కూడా పెరిగిందని చెబుతున్నారు. ప్రస్తుతం వైద్యం ఒక వ్యాపారంగా మారిందంటున్నారు పార్వతమ్మ.

లండన్‌లో బసవేశ్వరుడి విగ్రహావిష్కరణ

పార్వతీ దేవికి ఇద్దరు కుమారులు. ఒకరు సూరజ్ పాటిల్ వ్యవసాయ రంగాన్ని ఎంచుకోగా, నీరజ్‌పాటిల్ వైద్య రంగాన్ని ఎంచుకున్నారు. నీరజ్‌పాటిల్ ఈస్ట్ లండన్‌లోని కింగ్‌జార్జ్ ఆస్పత్రిలో వైద్యుడిగా పనిచేస్తూ అక్కడ సామాజిక సేవల్లో పాల్గొనే వారు. లండన్‌లో టోనిబ్లేయిర్ ప్రేరణతో లేబర్ పార్టీలో చేరి 2006 నుంచి 2010 వరకు లండన్‌లోని లాంబ్‌బెత్ మేయర్‌గా పనిచేశారు. అక్కడ బసవేశ్వరుడి విగ్రహాన్ని ప్రధాని మోదీతో ఆవిష్కరింపజేయడం విశేషం.

మహిళల్లో చైతన్యం రావాలి



పుట్టింటి తెలుగువారు, మెట్టినింటి కన్నడిగులు చాలా మంచి వాళ్లు. తెలుగు, కన్నడిగుల మధ్య మంచి సంబంధాలున్నాయి. ఇక్కడి మహిళల్లో బాగా చైతన్యం రావాలి. సామాజిక స్పృహ పెరగాలి. 50ఏళ్ల నా సామాజిక సేవ ఎంతో సంతృప్తినిచ్చింది. నా భర్త ప్రోత్సాహంతో కుటుంబ సభ్యులు సామాజిక సేవలో ముందుండడం ఆనందాన్నిస్తోంది.

- వైద్యురాలు పార్వతీదేవి

మోస్తరు నుంచి భారీ వర్షం



దెబ్బతిన్న బీర, కాకర తోటను చూపుతున్న రైతు నీలమ్మ

(ఐదో పేజీ తరువాయి)

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో ఒక్కసారిగా సాధారణ వర్షపాతం పెరిగింది. జూలై 16 వరకు రంగారెడ్డి జిల్లాలో 26 శాతం లోటువర్ష పాతం నుంచి 8 శాతం అధిక వర్షపాతానికి చేరింది. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జూలై 16 నాటికి 62శాతం లోటు వర్షపాతం నమోదవగా శనివారం నాటికి అది 33శాతానికి చేరింది. భారీ వర్షాలు మరో మూడురోజుల పాటు ఇదే తరహాలో కురిస్తే ఉమ్మడి జిల్లాలో అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలుంటాయని తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ అధికారులు చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో జూన్ 1 నుంచి జూలై 19 నాటికి 182.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 196.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్రవారం ఒక్కరోజే సాధారణంగా 4.8మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 30.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జూలై 16 నాటికి జిల్లా వ్యాప్తంగా సాధారణంగా 169.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 124.9 మిల్లీ మీటర్లు నమోదైంది. ఇది సాధారణం కంటే 26 శాతం తక్కువ వర్షపాతం కాగా, రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో 8 శాతం అధిక వర్షపాతానికి చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో జూలై 19 నాటికి 205.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా 136.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఇది ఈ సీజన్‌లో సాధారణం కంటే -33శాతం వర్షపాతం. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 5.1 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 37.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూలై 16వ తేదీ నాటికి సాధారణంగా 192.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవ్వాల్సి ఉండగా 74.0 మిల్లీ మీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 62 శాతం తక్కువ వర్షపాతం కాగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లోటు వర్షపాతం 33 శాతానికి చేరింది.

స్నేహితులే శత్రువులై..

- అప్పు తీర్చినా డబ్బుల కోసం వేధింపులు
- మనోవేదనతో ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య

మెదక్ అర్బన్/ మేడ్చల్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తాను నమ్మిన స్నేహితులు శత్రువులుగా మారి డబ్బు కోసం వేధిస్తుండటంతో మెదక్‌లో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు కారణమైన వారి పేర్లను సెల్ఫీ వీడియోలో పేర్కొని ఉరేసుకున్నాడు. మెదక్‌కు చెందిన కాముని రమేశ్(52) హవేలీ ఘణపూర్ మండలం సర్దన జెడ్పీ పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆయన గతంలో చిట్టీలు, రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అప్పు తీసుకున్నారు. అప్పులకు వడ్డీలు పెరిగాయి. తన ఇల్లు, స్థలాలు, బంగారాన్ని అమ్మేసి అప్పు తీర్చారు. అప్పు తీర్చినా కొందరు చెక్‌బౌన్స్ కేసులు వేసి వేధించారు. తీవ్ర మనోవేదనకు లోనై శనివారం మేడ్చల్‌లోని ఓ లాడ్జి లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు.సీఎం రేవంత్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తన భార్య, పిల్లలను ఆదుకోవాలని రమేశ్ వీడియోలో కోరారు. కష్టకాలంలో తనకు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, చంద్రపాల్, మల్లికార్జున్‌గౌడ్, కృష్ణారెడ్డి మద్దతుగా నిలిచారని వీడియోలో తెలిపారు.

మొక్కలు నాటి కాపాడండి



నందివనపర్తిలో మొక్కలు నాటుతున్న అధికారులు

యాచారం, జూలై 19(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరు విధిగా మొక్కలునాటి వాటిని కాపాడాలని, అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ నరసింహనాయక్, కన్నానాయక్ అన్నారు. శనివారం నందివనపర్తి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అటవీసంపద తగ్గడంతోనే ఆశించిన మేర వర్షాలు కురియడంలేదన్నారు. వృక్ష సంపద తరగడంతో కోతులు, ఇతర వన్యప్రాణులు గ్రామాలకొస్తున్నాయన్నారు. నెమళ్లపై తమ శాఖ నిఘా వేసిందన్నారు. పలు గ్రామాల్లో జింకలు కూడా సంచరిస్తున్నట్లు చెప్పారు. నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారిపై వాహనాలు వేగం తగ్గించుకోవాలని రోడ్డుపైకి జింకలు వస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరామశాస్త్రి, కిషన్‌నాయక్, జంగారావు, మహేందర్, పీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాల వేళల్లో
సభ్యత్వ నమోదా?

చౌదరిగూడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విధి నిర్వహణ కంటే తమ సంఘాల సభ్యత్వాలు పెంచుకునేందుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. పాఠశాల సమయంలో సభ్యత్వాలు నమోదు చేస్తున్నారు. శనివారం చౌదరిగూడ జెడ్పీ, ఇంద్రనగర్, పెద్దఎల్కిచర్ల, చౌదరిగూడ, ఎదిర, చేగిరెడ్డి ఘణపూర్ పాఠశాలలకు చెందిన కొందరు టీచర్లు సభ్యత్వ నమోదుకు వెళ్లారు. టీచర్లు ఇలా ఉంటే విద్యార్థుల చదువులు ఎలా? అని తల్లిదండ్రులు, పలువురుల వాపోతున్నారు.

ఇండస్ట్రియల్ కారిడార్ భూ సేకరణను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

దుద్యాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హకీంపేట్, లగచర్ల, పోలెపల్లి గ్రామాల పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం చేపట్టిన భూ సేకరణను త్వరగా పూర్తి చేయాలని తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. తహసీల్దార్ కిషన్‌నాయక్‌తో కలిసి శనివారం ఆయా గ్రామాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం సేకరించిన భూములను పరిశీలించారు. భూసేకరణలో నోటిఫికేషన్‌కు సంబంధించి 1274ఎకరాలు ఉండగా రైతుల అంగీకారంతో మిగతా భూమిని సేకరించాలని తహసీల్దార్‌కు సూచించారు. ఇప్పటి వరకు 914ఎకరాల భూమిని రైతుల నుంచి అధికారులు సేకరించారు. ఆయన వెంట ఆర్ఐ నవీన్‌కుమార్ ఉన్నారు.

పంచాయతీరాజ్ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యుడిగా జైపాల్‌రెడ్డి



జైపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తాండూరు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చంద్రవంచ ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం జైపాల్‌రెడ్డి పంచాయతీరాజ్ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యుడిగా మరోసారి ఎన్నికయ్యారు. ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి దోమ అమర్నాథ్ సమక్షంలో శనివారం పంచాయతీరాజ్ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సంపాదకవర్గంలో జైపాల్‌రెడ్డి ఎన్నిక కావడంతో ఇది మూడోసారి. అనంతరం ఉపాధ్యాయులు జైపాల్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి తాండూరు పీఆర్టీయూటీఎస్ అధ్యక్షుడు జొన్నల వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల పురుషోత్తంరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు చింతల యాదయ్య మాట్లాడుతూ.. పాఠశాలల్లో వంటచేసే మధ్యాహ్న భోజన కార్మికులకు గ్యాస్ పొయ్యి, సిలిండర్ అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు శ్రీనివాస్, పుష్ప, భక్షభారాణి పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రత్యేకాధికారిగా సమీరా

మర్పల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మర్పల్లి కేజీబీవీ ప్రత్యేకాధికారిణి సమీరా శనివారం బాధ్యతలు చేపట్టినట్లు ఎంఈవో అంజిలప్ప తెలిపారు. వారం రోజుల కిందట పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారిణి విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పురుగుల అన్నం పెడుతుండటంపై విద్యార్థులు ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ మేరకు స్పందించిన అధికారులు ప్రత్యేకాధికారిణి సునీతను బదిలీ చేశారు. ఆమె స్థానంలో నూతన ప్రత్యేకాధికారిణిగా సమీరా, పీటీగా నందిని విధుల్లో చేరారని ఎంఈవో తెలిపారు.

అక్రమ నిర్మాణాలను తొలగించాలి

మేడ్చల్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలను తొలగించాలని వినాయక్‌నగర్ కాలనీవాసులు శనివారం మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ చంద్ర ప్రకాష్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కాలనీ ప్రవేశ మార్గంలో హాట్ నిర్వాహకులు రోడ్డును అక్రమించి అక్రమంగా నిర్మాణం చేపట్టి రాక పోకలకు అడ్డంకులు కల్పిస్తున్నారని పేర్కొన్నారు.

బీసీ గురుకులలో సీట్లు పెంచాలి

తాండూరు, జూలై19 (ఆంధ్రజ్యోతి): బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో సీట్లు పెంచాలని జాతీయ బీసీ సంఘం కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్ అన్నారు. శనివారం హైదరాబాద్ రోడ్డు మార్గంలో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను బీసీ నేతలతో కలిసి పరిశీలించారు. అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలో 50శాతం సీట్లు పెంచాలని విద్యార్థులకు సరైన సదుపాయలు కల్పించి సొంత భవనాలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ షుకుర్, బీసీ నాయకులు పాల్గొన్నారు.

కులకచర్లలో 12 ఎంపీటీసీ స్థానాలు

కులకచర్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు ఖరారు చేశారు. గ్రామాల వారీగా ఎంపీటీసీలు కుసుమ సముద్రం, అంతారం, బండవెల్కిచర్ల, ఘనపూర్, ఇప్పాయిపల్లి, కులకచర్ల, కామునిపల్లి, ముజాహిద్‌పూర్, పటేల్ చెరువు తండా, పుట్టపహాడ్, తిరుమలాపూర్, సాల్విడ్‌లను 2011 జనాభా లెక్కల ప్రకారం ఎంపీటీసీ స్థానాలను ఖరారు చేశారు. మండలంలో ఎన్నికల నిర్వాహణకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు.

మోస్తరు వర్షం



బొంరాస్‌పేట్‌లో కురుస్తున్న వర్షం



ధారూరు: పత్తి చేనులో నిలిచిన నీరు

మర్పల్లి/బొంరాస్‌పేట్/ధారూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గత నెల రోజులుగా వర్షాల జాడ లేకపోవడంతో రైతులు దిగులు చెందారు. ఈ క్రమంలో జిల్లాలో శుక్ర, శనివారాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షం కురవడంతో సాగు చేసిన పంటలకు మేలు జరుగుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మర్పల్లి మండలంలోని సిరిపూరం వీరన్న వాగు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షపు నీటితో పొంగిపొర్లింది. దీంతో మోమిన్‌పేట్ నుంచి మండలానికి రాకపోకలు నిలిచిపోయాయి. ధారూరు మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. ఈ వర్షానికి పత్తిచేనులో నీరు నిలిచాయి. వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి భారీ వర్షం కావడంతో పంటలకు మేలు జరిగింది.

పాఠశాలల్లో ఘనంగా బోనాలు



ధారూరు: బోనాలతో పాఠశాల విద్యార్థులు

తాండూరు, జూలై19 (ఆంధ్రజ్యోతి) : తాండూరు శ్రీ నేతాజీ గురుదేవ్ గురుకుల్ పాఠశాలలో ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ మణిమాల, ప్రిన్సిపల్ శివలీల పాల్గొన్నారు.

ధారూరు: ధారూరులోని శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం చిన్నారులతో ఆషాఢ బోనాల పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారం సెరినిటీ పాఠశాలలో శనివారం బోనాల పండుగ సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ నేముల జంగిరెడ్డి, డైరెక్టర్ వసంత పాల్గొన్నారు.

కొడంగల్: పట్టణంలోని ఇండస్ వ్యాలీ పాఠశాలలో శనివారం గోరింటాకు, బోనాల పండగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రేణుకాదేవి, ఐశ్వర్య, భవాని, స్వాతి, వరలక్ష్మి, మమత, సంధ్య, మంజుల, లలిత, రాములు, కేశవులు పాల్గొన్నారు.

నేడు, రేపు బోనాల పండుగ

తాండూరులోని శాంత్ మహల్ చౌరస్తాలోని కాళికాదేవి, ఆదర్శనగర్ రక్తమైసమ్మ ఆలయాలు బోనాల పండుగకు ముస్తాబయ్యాయి. ఈనెల 20, 21వ తేదీల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో బోనాల పండుగను పెద్దఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని ఆహ్వానించారు.

అక్రమ తవ్వకాలు జరిపితే చర్యలు

తాండూరు రూరల్, జూలై 19, (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవని ఏడీ సత్యానారాయణ అన్నారు. గనులు, విద్యుత్, రెవెన్యూ అధికారుల బృందంతో కలిసి శనివారం మల్కాపూర్‌లోని సర్వేనంబర్-75, 76లో కొనసాగుతున్న గనులను పరిశీలించారు. మల్కాపూర్‌లోని 75, 76లో ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వుతున్న గనుల్లో విద్యుత్‌కనెక్షన్లు తొలగించినట్లు ఈ సందర్భంగా తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

మేడ్చల్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) ట్రాఫిక్ నిబంధనలపై ప్రతీ విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్ అన్నారు. స్థానిక బావి పాఠశాలలో శనివారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంయుక్త, తదితరులు పాల్గొన్నారు.

బషీరాబాద్ ఎంపీడీవోగా తిరుమలస్వామి బాధ్యతలు స్వీకరణ



బషీరాబాద్, జూలై 19(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ ఎంపీడీవోగా కె.తిరుమలస్వామి శనివారం బాధ్యతలు చేపట్టారు. రెగ్యులర్ ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకున్న తిరుమలస్వామి నల్లగొండ జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతకాలం ఇక్కడి ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన ఎంపీవో విజయ్‌కుమార్ ఆయనకు బాధ్యతలను అప్పగించారు. నూతన ఎంపీడీవోకు సూపరింటెండెంట్ విజయకుమారి, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు శేర్‌ఖాన్, లక్ష్మయ్య స్వాగతం పలికారు.

క్రీడలతో మానసికోల్లాసం

వికారాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్ని ఇస్తాయని వికారాబాద్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్ అన్నారు. పట్టణంలోని మిషన్ గ్రౌండ్‌లో ఎంపీపీఎల్ సీజన్ 1 టోర్నమెంట్ లోగోను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

ఘట్‌కేసర్ రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండాపూర్‌లోని ఓ ఫామ్‌హౌజ్‌లో గుట్టుచప్పుడు కాకుండా అదే గ్రామానికి చెందిన పేకాడుతున్న విషయం తెలుసుకున్న ఎస్‌వోటీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.84వేల నగదుతో పాటు ఏడు సెల్‌ఫోన్లు, నాలుగు సెట్ల ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాఠశాల బస్సుకు తప్పిన ప్రమాదం



అదుపుతప్పి మురికి కాలువలోకి దూసుకెళ్లిన పాఠశాల బస్సు

మేడ్చల్ టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చాణిక్య విజన్ పాఠశాల విద్యార్థులను తరలిస్తున్న బస్సు లింగాపూర్ సమీపంలో అదుతప్పి రోడ్డు పక్కనే ఉన్న మురికి కాలువలో దూసుకెళ్లింది. బస్సు అదుపు తప్పిన వెంటనే డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించటంతో ప్రమాదం తప్పింది. బస్సులో 12మంది విద్యార్థులు ఉండగా వారిలో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లి దండ్రులు ఘటనాస్థలానికి హుటాహుటిన చేరుకుని తమ పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

పెద్దేముల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో గేదె మృత్యువాతపడిన ఘటన మండలంలోని జనగాంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ముకుంద్‌రెడ్డికి చెందిన గేదెలను మేత కోసం పశువుల కాపరి వ్యవసాయపొలానికి తీసుకెళ్లాడు. మార్గమధ్యలో ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టు రక్షణ కంచె లేకపోవడంతో గేదె అక్కడ పచ్చగడ్డిని మేయడానికి వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడింది. గేదె విలువ రూ.70వేలు ఉంటుందని రైతు ముకుంద్‌రెడ్డి తెలిపాడు. విద్యుత్ అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని, ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకున్నాడు.

ధారూరు ఎస్‌ఐగా రాఘవేందర్



ఎస్‌ఐ రాఘవేందర్

ధారూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ధారూరు ఎస్‌ఐగా సున్నం రాఘవేందర్ శనివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ అనితను వికారాబాద్ మహిళా పోలీసుస్టేషన్‌కు బదిలీచేశారు. ఆమె స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న రాఘవేందర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.

పాఠశాలలో విద్యార్థుల కౌన్సిల్ ఎన్నికలు



స్కూల్ కౌన్సిల్ ఎన్నికల్లో ఓటు వేస్తున్న విద్యార్థులు

తాండూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో 2025-26 స్కూల్ కౌన్సిల్ ఎన్నికల్లో విద్యార్థులు ఉత్సాహంగా నిర్వహించారు. 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు తమ హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్‌ను ఎన్నుకున్నారు. ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, డైరెక్టర్ సతీష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఓటు విలువ, ఎన్నికల విధానం నాయకత్వ నైపుణ్యాలు ప్రాముఖ్యతను వివరించారు. 7వ తరగతి విద్యార్థులు ఓటింగ్ విలువపై నాటకాన్ని ప్రదర్శించారు.

మంత్రి గడ్డం వివేక్‌ను కలిసిన మాల మహానాడు నాయకులు

చౌడాపూర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కార్మిక, ఉపాధి కల్పన, భూగర్భ, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని మాల మహానాడు నాయకులు కలిశారు. శనివారం హైదరాబాద్‌లో వారు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మాలలకు సముచిత స్థానం కల్పించాలని కోరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చౌడాపూర్ వెంకటేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజు పాల్గొన్నారు.

వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలి

మర్పల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సిరిపూరం వీరన్న వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కోరారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో శనివారం ప్రచురితమైన 'ఆ నలుగురికి దారేది' కథనానికి ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి స్పందించారు. గ్రామస్థులు శ్మశానవాటికకు వెళ్లే దారిలో వీరన్న వాగు ఉండటంతో గ్రామస్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టర్ వెంటనే స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. వంతెన నిర్మాణం పూర్తయ్యేలా మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

విదేశీ కలుపు మొక్కలను నిర్మూలించాలి

బషీరాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు హానికరమైన విదేశీ కలుపు మొక్కలను నిర్మూలనకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎకోఫాన్ సొసైటీ అధినేత మెట్టు సాయిసంపత్ అభిప్రాయం వ్యక్తంచేశారు. బద్లాపూర్, కాశీంపూర్, కుప్పన్‌కోట్ గ్రామాల రైతులు, యువతతో కలిసి శనివారం ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఎకోఫాన్ సొసైటీ అధినేత సాయిసంపత్ మట్లాడుతూ విదేశీ ఆక్రమక మొక్కలు మన వ్యవసాయ భూముల సారాన్ని పీక్కుతింటున్నాయన్నారు. దీంతో దిగుబడి తగ్గి నెల సమతుల్యం దెబ్బతింటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎకోఫాన్ సొసైటీ ప్రతినిధి తలారి విక్రమ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

సమస్యలపై నిరంతర పోరాటం

పరిగి,జూలై 19 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం సాగిస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, పరిగి మండల గౌరవ అధ్యక్షుడు ఎండీ ఉస్మాన్‌అలీ, అధ్యక్షుడు బుగ్గయ్యలు అన్నారు. పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదులో భాగంగా సయ్యద్‌మల్కాపూర్,చిట్యాల్ జాఫర్‌పల్లి తదితర పాఠశాలల్లో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు భీమయ్య, సాయిలు, సుధాకర్, శ్రీశైలం, రమేశ్, సురేష్ పాల్గొన్నారు.

ఏడీ రుద్రమూర్తి సేవలు మరువలేనివి

తాండూరు రూరల్, జూలై 19, (ఆంధ్రజ్యోతి): తాండూరు వ్యవసాయ ఏడీగా విధులు నిర్వహించిన రుద్రమూర్తి సేవలు మరువలేనివని తాండూరు డివిజన్ ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ వ్యాపారులు అన్నారు. రుద్రమూర్తి పదోన్నతిపై ఆసీఫాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఆయనకు శనివారం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో తాండూరు ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ ఏడీ కొమరయ్య ఆధ్వర్యంలో తాండూరు డివిజన్ ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ వ్యాపారులతోపాటు వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఏవోలు, ఏఈవోలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధి రవిరాజ్, ఇన్‌చార్జి ఏడీ కొమరయ్య పాల్గొన్నారు.

భారీగా ఎస్‌ఐల స్థానచలనం

(ఐదో పేజీ తరువాయి)

కొడంగల్ ఎస్‌ఐ-2గా బదిలీ అయ్యారు. యాలాల్ ఎస్‌ఐ గిరెన్న వికారాబాద్ ఎస్‌ఐ-1గా బదిలీ కాగా, బొంరాస్‌పేట్ ఎస్‌ఐ ఎండీ అబ్దుల్ రవూఫ్‌ను మర్పల్లికి బదిలీ చేశారు. ధారూరు ఎస్‌ఐ అనితను వికారాబాద్ మహిళా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయగా, కొడంగల్ ఎస్‌ఐ గోపాల్‌ను ధారూరు ఎస్‌ఐ2గా నియమించారు. దోమ ఎస్‌ఐ ఆనంద్‌కుమార్‌ను వికారాబాద్ పీసీఆర్‌కు బదిలీ చేశారు. పోస్టింగుల కోసం ఎదురుచూస్తున్న ఎస్‌ఐలలో సాజిద్‌కు కరణ్‌కోట్ ఎస్‌ఐ-2గా, స్వామిదాస్‌కు వికారాబాద్ సీసీఎస్‌కు పోస్టింగ్ ఇవ్వగా, యాదగిరిని డీటీసీకి కేటాయించి దుద్యాల్ పీఎస్‌కు అటాచ్ చేశారు. వేకెన్సీ రిజర్వు(వీఆర్)లో ఉండి పోస్టింగ్‌ల కోసం ఎదురుచూస్తున్న నాగేందర్‌ను పరిగి ఎస్‌ఐ-2గా, మూడ్ అంబారియాకు తాండూరు టౌన్ ఎస్‌ఐగా, శ్రీనివాస్‌కు బషీరాబాద్ ఎస్‌ఐ-2గా పోస్టింగ్ ఇచ్చారు. బాల వెంకటరమణను నారాయణపేట వీఆర్‌లో ఉంచి బొంరాస్‌పేట్‌కు అటాచ్ చేశారు. బషీరాబాద్ ఎస్‌ఐ శంకర్, కరణ్ కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, దౌల్తాబాద్ ఎస్‌ఐ రవిని వికారాబాద్ సీసీఎస్‌కు బదిలీ చేశారు.

శిక్షణ పూర్తి చేసుకున్న వారికి పోస్టింగ్

శిక్షణాకాలం పూర్తిచేసుకుని పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ప్రొబేషనరీ ఎస్‌ఐల్లో శ్వేతకు డీఎస్‌బీలో కేటాయించి భరోసా కేంద్రానికి అటాచ్ చేశారు. ఎండీ నుమన్ అలీకి బషీరాబాద్, రాథోడ్‌వినోద్‌కు తాండూరు టౌన్, మర్పల్లి మీనాక్షికి కొడంగల్, బర్దీపూర్ మోహన్ కృష్ణకు పరిగి, వాదిత్య వసంత్ జాదవ్‌కు తాండూరు టౌన్ ఎస్‌ఐ-2, పుష్పలతకు కరణ్‌కోట్, బంగారు రాజ్ కుమార్‌కు దౌల్తాబాద్, మర్పల్లి ప్రవీణ్‌కుమార్‌కు వికారాబాద్ ఎస్‌ఐ-2గా పోస్టింగ్ ఇచ్చారు. పోగుల శ్రీశైలం దోమ ఎస్‌ఐగా, విఠల్‌కు యాలాల్, గరిదెగామ పుద్దిక్‌కు నవాబ్‌పేట్, రమావత్ శ్వేతకు వికారాబాద్ డీఎస్బీకి పోస్టింగ్ ఇచ్చి మహిళా పోలీస్ స్టేషన్‌కు అటాచ్ చేశారు. సున్నం రాఘవేందర్‌కు ధారూరు ఎస్‌ఐగా, కడల వేణుకుమార్‌కు పెద్దేముల్ ఎస్‌ఐగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే పరిగి ఎస్‌ఐ సంతోష్‌కుమార్, నవాబ్‌పేట్ ఎస్‌ఐ అరుణ్‌కుమార్, వికారాబాద్ ఎస్‌ఐ శ్రీశైలం యాదవ్‌లను వీఆర్‌లో ఉంచారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి: ఎస్పీ

కొత్తగా విధుల్లో చేరనున్న అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. ఇటీవల జిల్లాకు కేటాయించబడిన 15 మంది ప్రొబేషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్ అధికారులకు శిక్షణ పూర్తయిన సందర్భంగా వారికి పోస్టింగ్‌లు కేటాయించినట్లు వెల్లడించారు. శనివారం వారితో సమావేశమై పలు సూచనలు చేశారు. కొత్తగా పోస్టింగ్‌లు పొందిన ఎస్‌ఐలు, స్థాన చలనం పొందిన ఎస్‌ఐలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మురళీధర్, డీఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ డీవీపీ రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



కులకచర్ల: అన్నంను పరిశీలిస్తున్న వైద్యాధికారి

కొడంగల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ సూచించారు. కొడంగల్ మండలంలోని పర్సాపూర్ యంపీయూపీఎస్ పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

దుద్యాల: మండలంలోని చిలుముల్‌మైలారంలో గల మైనారిటీ గురుకుల పాఠశాలను మైనారిటీ గురుకుల విద్యాసంస్థల రాష్ట్ర కార్యదర్శి షఫివుల్లా శనివారం తనిఖీ చేశారు. ఆయన వెంట జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రాజేశ్వరి, శ్రీనివాస్‌రెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ జహీర్ ఉన్నారు.

కులకచర్ల: విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వైద్యాధికారి కిరణ్ కుమార్‌గౌడ్ అన్నారు. మండలంలోని రాంపూర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. తయారు చేసిన భోజనం, పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

దోమ: మెట్టుగడ్డతండా, కిష్టాపూర్, రాకొండ పాఠశాలలను శనివారం ఎంఈవో వెంకట్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ యూనిఫాం గురించి ఉపాధ్యాయులతో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా టీఎల్ఎం విధానం ద్వారా బోధించాలని సూచించారు. కిష్టాపూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు లాల్యానాయక్, అనంతయ్య, రఘుపతిరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

బషీరాబాద్: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల(బాలికలు)లో శనివారం మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ షాహిదాబేగం, విద్యాధికారి దూస రాములు పరిశీలించారు. ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన వంట పాత్రలలోనే వండిపెట్టాలని నిర్వహకులను వారు ఆదేశించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో తహసీల్దార్, విద్యాధికారి కలిసి సహపంక్తి భోజనం చేశారు. వీరివెంట సర్వేయర్ ప్రభుకుమార్, తిరుపతిరెడ్డి, శ్రావణి పాల్గొన్నారు.

బస్సులు సకాలంలో నడపాలి



వికారాబాద్ డీఎంకు వినతి పత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

వికారాబాద్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు స్కూల్స్, కళాశాలలకు వెళ్లే సమయానికి బస్సులు నడపాలని జిల్లా కన్వీనర్ హరీష్‌రావు కోరారు. ఆయన శనివారం డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉదయం 10 గంటలకు వికారాబాద్ చేసుకోవాల్సిన బస్సులు సమయానికి రాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మదన్‌పల్లి గ్రామానికి వెళ్లే బస్సు సమయానికి నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్, నందు తదితరులు ఉన్నారు.

తాండూరు: తాండూరు ఆర్టీసీ బస్సులు సకాలంలో నడపాలని శనివారం సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. డిపో కంట్రోలర్ రఘుపతి, శంకర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమయానికి బస్సులు రాకపోవడంతో కళాశాలల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆదాయం ఎక్కువగా వచ్చే ఏరియాకు బస్సులు పంపిస్తూ మిగిలిన ఏరియాకు బస్సులు నడపడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: మండలంలోని రుద్రారం, దౌల్తాబాద్ మండలంలోని నీటూర్ గ్రామాలకు చెందిన విద్యార్థులు సమయానికి బస్సులు రాకపోవడంతో పాఠశాలకు రావడం ఆలస్యమవుతోందని వాపోయారు. అధికారులు స్పందించి సమయానుకూలంగా బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సంక్షిప్తంగా..

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

ఘట్‌కేసర్ రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటూ పట్టుదలతో చదవాలని రాష్ట్రీయ గ్రామీణ సాక్షరా మిషన్ సభ్యుడు సురేష్ తెలిపారు. అవుశాపూర్‌లోని జిల్లాపరిషత్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. నాయకులు ఏనుగు మశ్చేందర్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్, మహేష్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

శామీర్‌పేట: పొన్నాల్ గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణం, వీధి దీపాలకు నిధులు కేటాయించాలని శనివారం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

దౌల్తాబాద్: అర్హులందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేస్తుందని తహసీల్దార్ గాయత్రి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు శనివారం రేషన్‌కార్డు ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు.

పౌరులు బాధ్యతగా వ్యవహరించాలి

ఘట్‌కేసర్: సమాజంలో పౌరులు బాధ్యతగా వ్యవహరించాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పరశురాం అన్నాడు. కొండాపూర్‌లో గల సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం స్ఫూర్తి ఆర్గనైజేషన్ నిర్వాహకుడు యాదగిరి ఆధ్వర్యంలో ప్రభుత్వ స్కూళ్ల అభివృద్ధి చేయడం, పర్యావరణాన్ని కాపాడడం, మాదక ద్రవ్యాలపై యుద్ధం, సైబర్ నేరాల నియంత్రణకు కృషిచేయాలనే వివిధ అంశాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

కాంగ్రెస్ నూతన గ్రామ కమిటీలు

చౌడాపూర్: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. మరికల్ అధ్యక్షుడిగా శివకుమార్, మక్తావెంకటాపూర్ అధ్యక్షుడిగా కేతవ సంతోష్, మల్కాపూర్ అధ్యక్షుడిగా కుర్వ రాములు, మందిపాల్ అధ్యక్షుడిగా బచ్చలి మల్లేశ్, పురసంపల్లి అధ్యక్షుడిగా కృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు.

నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

దోమ: ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను చేపట్టాలని ఎంపీడీవో గ్యామానాయక్ అన్నారు. మోత్కూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

యాలాల: చెన్నారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు నాయకులు భూమిపూజ చేశారు. గ్రామంలోని పలువురు లబ్ధిదారులు నిర్మాణపనులు చేపట్టగా శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బీ-బ్లాక్ అధ్యక్షులు అనిల్ గుప్తా భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.

నేటి బాలలే భావి భారత నిర్మాతలు

వికారాబాద్: నేటి బాలలే భావి భారత నిర్మాతలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి అన్నారు. గిరిగేట్‌పల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అదే గ్రామానికి చెందిన రామకృష్ణ బాల బాలికలకు శనివారం బూట్లు, నోట్ బుక్స్ ఉచితంగా అందజేశారు.

విద్యార్థులకు ఉపాధ్యాయుడి చేయూత

మోమిన్‌పేట్: అమ్రాదికలాన్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు శ్వేత ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు నాగేశ్వర్ శనివారం 32మంది విద్యార్థులకు టై, బెల్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శ్రీలత పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

శామీర్‌పేట: సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిలుగౌడ్ పిలుపునిచ్చారు. మేడ్చల్‌లో ఈ నెల 19 నుంచి 22వరకు పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన నిధులకోసం శనివారం సాయిలుగౌడ్ శామీర్‌పేటలో విరాళాలు సేకరించారు.

దాడులు చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

పరిగి: దళితులపై దాడులు చేసిన అగ్రకుల పెత్తందార్లను వెంటనే అరెస్ట్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుగ్గప్ప, ఎం.వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బస్సు చంద్రయ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల పోరాట సమతి జిల్లా అధ్యక్షుడు కె.చంద్రయ్య, ఆయా సంఘాల నాయకులు రమేశ్‌బాబు, ఎండీ హబీబ్‌లు డిమాడ్ చేశారు. ఈ మేరకు శనివారం పరిగి డీఎస్పీకి వినతిపత్రాన్ని అందజేశారు.

చెట్లే జీవకోటికి ప్రాణాధారం

కీసర రూరల్: చెట్లే జీవకోటికి ప్రాణాధారమని కేజీఆర్ కళాశాల ఛైర్మన్ గోవింద్‌రెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని కేజీఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ కళాశాల ఆవరణలో శనివారం వన మహోత్సవం నిర్వహించారు.

కల్లు దుకాణాల పై ఎక్సైజ్ దాడులను నిలిపివేయాలి

ధారూరు: జిల్లాలో కల్లు దుకాణాలపై ఎక్సైజ్ అధికారుల దాడులను నిలిపివేయాలని కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాజేందర్ గౌడ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సంఘటనతో కల్తీకల్లు పేరిట గౌడకులస్థులను ప్రభుత్వం వేధించటం సరికాదని ఆయన పేర్కొన్నారు. గౌడ కులస్థుల సంక్షేమానికి గౌడ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

విద్యార్థులకు భోజన ప్లేట్ల పంపిణీ

యాలాల: లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ మేనేజర్ అరవింద్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం చెన్నారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు.